# క్రైమ్ కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 152 క్రిష్ణా, గురువారం 26- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైమ్ కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## తొమ్మిదేళ్ల తర్వాత ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం పై చర్యలు!



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 25:** ప్రధాని చివరిసారిగా 2017లో ను సందర్శించారు, ఆ తర్వాత తొమ్మిది సంవత్సరాల తర్వాత ఆయన మళ్లీ ఈ దేశంలో అధికారిక పర్యటనకు వచ్చినారు. ఈ పర్యటనల్లో భారత్–ఇజ్రాయెల్ మధ్య బలమైన సంబంధాన్ని ప్రపంచానికి మరోసారి చాటిచెప్పారు.ఇజ్రాయెల్‌లోని పార్లమెంట్ 'నెస్సెట్' ను ఉద్దేశించి ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా మోదీ రికార్డు సృష్టించారు. ఆయన పార్లమెంటులోకి ప్రవేశించినప్పుడు సభ్యులందరూ లేచి నిలబడి, పెద్ద ఉత్సాహంతో "మోదీ... మోదీ!" అంటూ స్వాగతం పలికారు.నెస్సెట్ స్పీకర్ అమీర్ ఒహానా ఆయనకు హిందీలో "నమస్తే" పలికారు మరియు "జెరూసలేమ్‌కు స్వాగతం" అన్నారు. వారు భారత్‌ను ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న దేశంగా పేర్కొన్నారు మరియు ఇజ్రాయెల్ పరిస్థితుల్లో భారత్‌కు ఎప్పుడూ అండగా ఉన్నారని అన్నారు.పరిగణనీయంగా, ఇజ్రాయెల్ ప్రధాని కూడా మోదీని "మిత్రుడు కంటే ఎక్కువ", "సోదరుడుతో సమాన" అని పేర్కొన్నారు. ఆయన "మోదీ హగ్" గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు, దీనిని హృదయపూర్వక ఆలింగనం అని అభివర్ణించారు. నెతన్యాహు భారతదేశం–ఇజ్రాయెల్ మధ్య సహకారాన్ని పెంచడానికి మోదీ ముఖ్య పాత్ర పోషిస్తున్నారని, వాణిజ్యం, భద్రత మరియు సాంకేతిక సహకారాలు పెరిగాయని చెప్పారు.ప్రధాని మోదీ ప్రసంగంలో, ఇజ్రాయెల్ పార్లమెంటులో మాట్లాడటం గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. ఆయన భారత–ఇజ్రాయెల్ బంధాన్ని ప్రాచీన నాగరికత కలిగిన రెండు దేశాల మధ్య స్నేహంగా వర్ణించారు. మోదీ హమాస్ వలన అక్టోబర్‌హా7న జరిగిన దాడులపై తీవ్ర సహానుభూతిని వ్యక్తం చేసి, ఉగ్రవాదానికి వ్యతిరేకత వ్యక్తం చేశారు, "టెర్రరిజానికి ఎలాంటి కారణం స్థదించబడదని" స్పష్టంగా చెప్పారు.మోదీ భారత్ 1.4 బిలియన్ ప్రజల అభినందనలను తీసుకుని వచ్చానని తెలిపాడు మరియు ఇజ్రాయెల్ ప్రజల బాధలను పంచుకున్నట్లుగా చెప్పారు. ఇజ్రాయెల్ పౌరుల హత్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించలేనని కూడా ప్రత్యేకంగా పేర్కొన్నారు.

## శ్రీకాకుళం, రాజమండ్రి ఘటనలపై సీఎం చంద్రబాబు సీరియస్..



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 25:** రాష్ట్రంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఈ అవాంఛనీయ ఘటనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీకాకుళంలో విజృంభిస్తున్న డయేరియా కేసులు మరియు రాజమండ్రిలో వెలుగుచూసిన కల్తీ పాల ఉదంతంపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్న సీఎం, ప్రతీ ప్రాణం ఎంతో విలువైనదని అధికారులకు స్పష్టం చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం:ప్రస్తుతం ఆస్పత్రుల్లో చేరుతున్న బాధితులకు నిరంతర పర్యవేక్షణలో వైద్యం అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా అత్యవసర స్థితిలో ఉన్న రోగులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. చికిత్స పొందుతున్న వారిలో ఒకరు వెంటిలేటర్‌పై ఉండగా, మరొకరికి డయాలసిస్ సేవలు అందిస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ క్లిష్ట సమయంలో బాధితుల కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన ఆదేశించారు.

గణాంకాలు మరియు ఆస్పత్రి వివరాలు:శ్రీకాకుళం డయేరియా ఘటనలో ఇప్పటివరకు మొత్తం 76 మంది అస్వస్థతకు గురై వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. ప్రతి రోగికి సంబంధించిన ఆరోగ్య రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, అవసరమైతే మెరుగైన చికిత్స కోసం ఇతర ప్రాంతాల నుండి నిపుణులైన వైద్యులను రప్పించాలని సీఎం ఆదేశించారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. కట్టుదిట్టమైన చర్యలకు ఆదేశం: ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, కల్తీ పాలు మరియు అపరిశుభ్ర తాగునీరు వంటి అంశాలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కల్తీకి పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని, అలాగే తాగునీటి నాణ్యతపై ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నీరు అందిస్తా




**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 25:** వైసీపీ పాలనలో రాష్ట్రం విధ్వంసమైందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. పునర్నిర్మాణం కోసం గత ఎన్నికల్లో ప్రజల సహకారం కోరానని తెలిపారు. రాష్ట్రం కోసమే జనసేన, బీజేపీతో కలిసి ఎన్డీయే కూటమిగా ఏర్పడి ప్రజల ఆశీస్సులు అందుకున్నామని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేటుతో అఖండ విజయం కట్టబెట్టారని ఆనందం వ్యక్తం చేశారు. అరకు నుంచి ఉమ్మడి ప్రకాశం వరకు ఒక్క సీటు కూడా వైసీపీకి రాలేదని అన్నారు.'మార్కాపురం జిల్లా కళ, వెలిగొండతో జలకళ, హార్టికల్చర్ రైతుల జీవితాల్లో కళకళ' కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన ర్యాంపుపై కలియతిరుగుతూ ప్రజల హర్షాతిరేకాల మధ్య ఆయన ప్రసంగించారు.వచ్చే ఎన్నికల్లో ప్రకాశం, మార్కాపురం జిల్లా అంతా కూటమిని వంద శాతం గెలిపించాలని కోరారు. 150 కిలోమీటర్లు ప్రయాణించి ఒంగోలుకు వెళ్లాల్సిన ఇబ్బందిని తొలగిస్తూ మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకున్నామని అన్నారు. మార్కాపురం జిల్లా మదనపల్లి జిల్లా, అలాగే పోలవరం జిల్లాను కూడా ఏర్పాటు చేశామని అన్నారు. వెనుకబడిన ప్రాంతాలు నీరు, సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డారని, మార్కాపురానికి మరో వరంగా వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి నీరు అందిస్తామని హామీ ఇచ్చారు.గతంలో ఈ ప్రాజెక్టుకు తానే శంకుస్థాపన చేశానని, అదే ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఇప్పుడు తనకు అవకాశం వచ్చిందని అన్నారు. 2019–24 మధ్య రాష్ట్రానికి చీకటి రోజులు అని వ్యాఖ్యానించారు. వెలిగొండ ప్రాజెక్టు ఒక్క అడుగు పడలేదని అన్నారు. ఈ ప్రాజెక్టును నిర్మిస్తే 4.35 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయని, గిద్దలూరు, ఎర్రగొండపాలెం, కనిగిరి లాంటి నియోజకవర్గాలతో పాటు ఉదయగిరి, కడప, బద్వేలుకు కూడా నీళ్లు వెళ్తాయని అన్నారు.గతంలో తాను ముఖ్యమంత్రిగా కొనసాగి ఉంటే 2021లోనే ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు ఇచ్చేవాళ్లమని వెల్లడించారు. గత పాలకుడు పనులు పూర్తి అయ్యాయని దొంగ నాటకాలు ఆడారని, పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని విమర్శించారు. నిజంగానే ప్రాజెక్టు పనులు పూర్తి అయి ఉంటే ఇప్పుడు నేను రావాల్సిన అవసరమే ఉండేది కాదని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి చేస్తానని నాలుగు సార్లు సభలు పెట్టి నాలుగు తేదీలు ఇచ్చాడని అన్నారు.ఉత్తుత్తి ప్రాజెక్టుకు రిబ్బన్ కట్ చేసి మోసం చేశాడని మాజీ ముఖ్యమంత్రిపై మండిపడ్డారు. రూ.9081 కోట్ల నిధులు ఈ ప్రాజెక్టుకు అవసరమని, ఇప్పటి వరకు నిర్మాణానికి రూ.5451 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. భూసేకరణకు రూ.484 కోట్లు, పునరావాసానికి రూ.184 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక చేశామని, మరో రూ.2,540 కోట్లు ఖర్చు చేస్తే కానీ వెలిగొండ పనులు పూర్తి కావని అన్నారు.గడచిన 20 నెలల్లో రూ.540 కోట్లు ఖర్చు చేసి పనులు వేగంగా చేపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. రూ.456 కోట్లతో విలువైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేసి బహిరంగ సభకు వచ్చానని తెలిపారు. గత పాలకులు ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుకు రూ.500 కోట్లు ఖర్చు చేసి పనులు అయిపోయాయని పంగ నామాలు పెట్టారని మండిపడ్డారు. ఎవరు మంచి చేస్తే వారికి అండగా నిలిస్తేనే ప్రజల జీవితాలు మెరుగవుతాయని అన్నారు.

## ఎస్ఎంఏ టైప్-1 అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి లోకేశ్ అండ



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 25:** ఎస్ఎంఏ టైప్–1 అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచేందుకు ముందుకు వచ్చారు. కర్నూలుకు చెందిన బాలిక పునర్విక ఈ వ్యాధితో బాధపడుతోంది. ఆమె చికిత్స కోసం మరో రూ.6 కోట్లు అవసరమని, ఆ మొత్తం అందేలా చూసే బాధ్యత తనదేనని 'ఎక్స్' వేదికగా హామీ ఇచ్చారు.తన కూతురు పునర్విక ఎస్ఎంఏ టైప్–1 వ్యాధితో బాధపడుతోందని, చికిత్స కోసం రూ.16 కోట్ల ఇంజెక్షన్ ఒక్కటే ఆప్షన్‌గా ఉందని, దాని కోసం తాము అన్ని రకాలుగా ప్రయత్నించి ప్రజల నుంచి, దాతల నుంచి రూ.10 కోట్ల వరకు సేకరించామని, మరో రూ.6 కోట్లు అవసరమని పేర్కొంటూ పునర్విక తండ్రి మంత్రి నారా లోకేశ్‌కు 'ఎక్స్' ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిపై నారా లోకేశ్ స్పందించారు.ఎస్ఎంఐ టైప్–1 అనేది అరుదైన వ్యాధి అని, దీనితో కండరాలు బలహీనపడతాయని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఇలాంటి స్థితిలోనూ పునర్విక పోరాడుతున్న తీరు అభినందనీయమని పేర్కొన్నారు. ఆమె నిజంగా ధైర్యవంతురాలని ప్రశంసించారు. అసాధారణ ధైర్యంతో వ్యాధితో పోరాటం చేస్తోందని అన్నారు.ఆమె ఇంజెక్షన్ కోసం రూ.16 కోట్లు అవసరమని, దాతల నుంచి రూ.10 కోట్లు సమకూరడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. పునర్విక ఇంజెక్షన్ కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ తాను సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. ఆమె చికిత్స కోసం మిగిలిన రూ.6 కోట్లు అందేలా చూసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. సహాయం చేయాలంటూ తన కార్యాలయ 'ఎక్స్' ఖాతాకు అటాచ్ చేశారు. పునర్వికకు సహాయం చేయడానికి మరింతమంది ముందుకు రావాలని కోరారు.

## హర్యానాలో టాయిలెట్ గుర్తులుగా శివాజీ, పద్మిని చిత్రాలు.




**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 25:** దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఆరాధ్య దైవంగా భావించే మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్, వీరనారి మహారాణి పద్మిని చిత్రాలను హర్యానాలో తీవ్రంగా అవమానించారు. ఫరీదాబాద్‌లోని ఒక ప్రైవేట్ బ్యాంక్వెట్ హాల్ నిర్వాహకులు శౌచాలయాల వద్ద లింగ సూచికలుగా వీరి చిత్రాలను వాడటం ఇప్పుడు దేశవ్యాప్తంగా పెను దుమారం రేపుతోంది. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జనం ఆగ్రహంతో ఊగిపోతున్నారు. ముఖ్యంగా దీనిపై స్పందించిన ఓ కాంగ్రెస్ ఎంపీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

అసలేం జరిగిందంటే..?

హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఉన్న ఒక ప్రైవేట్ బ్యాంకెట్ హాల్‌లో పురుషుల టాయిలెట్ తలుపుపై ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రాన్ని, మహిళల టాయిలెట్ తలుపుపై మహారాణి పద్మిని చిత్రాన్ని అతికించారు. సాధారణంగా స్త్రీ, పురుషుల గుర్తులను వాడాల్సిన చోట.. ఇలాంటి చారిత్రక వీరుల చిత్రాలను ఉపయోగించడం పట్ల నెటిజన్లు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. 17వ శతాబ్దపు గొప్ప పాలకుడిగా, ధైర్య సాహసాలకు నిలువుటద్దంగా నిలిచే శివాజీ చిత్రాన్ని ఇలాంటి చోట వాడటం అక్షరాలా వికృత చేష్టేనని మరాఠా సంఘాలు మండిపడుతున్నాయి. ఈ ఉదంతంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. హర్యానాలోని బీజేపీ ప్రభుత్వం జాతీయ వీరుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించింది. ముఖ్యంగా కాంగ్రెస్ ఎంపీ వర్షాగైక్వాడ్ ఇందుకు సంబంధించిన ఓ వీడియోను షేర్ చేస్తూ.. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. శివాజీ మహారాజ్ మాకు దైవంతో సమానం అని.. ఆయన గౌరవానికి భంగం కలిగేలా చేసిన ఈ చర్యపై హర్యానా ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ చిత్రాలను తొలగించాలని డిమాండ్ చేశారు.

మరోవైపు మహారాష్ట్రకు చెందిన శివసేన నేత షైనా ఎన్‌సీ కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. "శివాజీ మహారాజ్‌ను మేము దైవంగా పూజిస్తాం. ఇలాంటి అవమానాన్ని సహించేది లేదు. మహారాష్ట్ర ప్రభుత్వం తరపున మేము హర్యానా సర్కారుతో మాట్లాడి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేశారు. విచారణకు డిమాండ్.. క్షమాపణలు చెప్పాలని పట్టు! సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లైన ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో ఈ వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు బ్యాంకెట్ హాల్ యాజమాన్యంపై నిప్పులు చెరుగుతున్నారు. సదరు బ్యాంక్వెట్ హాల్ యాజమాన్యం బహిరంగ క్షమాపణ చెప్పాలని, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ వివాదంపై అటు హాల్ యాజమాన్యం గానీ, ఇటు హర్యానా అధికారులు గానీ ఇప్పటి వరకు అధికారికంగా స్పందించలేదు. చూడాలి మరి ఏం జరగనుంది అనేది.

## ఏపీడబ్ల్యూజేఎఫ్ నందిగామ నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక..

**నియోజకవర్గ అధ్యేక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనా షేక్ నాగులుమీరా..**




**ఎన్టీఆర్ జిల్లా,నందిగామ,ఫిబ్రవరి 25(బ్యూరో చీఫ్ సల్మాన్):**ఏపీడబ్ల్యూజేఎఫ్ నందిగామ నియోజకవర్గ కమిటీ అధ్యేక్షులుగా షేక్ నాగుల్ మీరా ను ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు ఎస్.వెంకట్రావు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి. ఆంజనేయులు మరియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంబి.నాథన్ అద్యేక్షతన కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా అనుకున్నారు. పలువురు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ సోదరులు ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాగుల్ మీరా మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న నందిగామ నియోజకవర్గ మీడియా మిత్రులకు, మరియు తన పేరును సూచించిన రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల వారికి, ఎన్టీఆర్ జిల్లా కమిటీ వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. నందిగామ నియోజకవర్గంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ బలోపేతం అయ్యేందుకు శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు. నందిగామ జర్నలిస్టుల కోసం ప్రభుత్వం నుండి రావలసిన సంక్షేమ పథకాలను పోరాడి సాధిస్తామని, మార్చి 4వ తేదీ నాడు జరగనున్న 'చలో విజయవాడ' కార్యక్రమం లో జర్నలిస్ట్ మిత్రులు అందరూ పాల్గొని విలేకరుల ఐకమత్యాన్ని చాటి చెప్పాలని కోరారు.

# ఇప్పటికీ అదే షాక్



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 25:** సాధారణంగా 25 కేవీ ట్రాన్స్‌ఫార్మరు ధర రూ.70 వేలు. వైసీపీ హయాంలో టెండరు ఖరారైంది రూ.1.60 లక్షలకు. అంటే రూ.90 వేలు అధికం. మ్యాచింగ్ మెటీరియల్‌కూ అధిక ధరలకే కాంట్రాక్టు దక్కించుకున్నారు. ఈ అదనపు సొమ్మును కమీషన్ల రూపంలో పంచుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ టెండరు దక్కించుకున్న సంస్థ కడపకు చెందిన షిరిడీసాయి ఎలక్ట్రికల్స్. ఇది వైసీపీ పెద్దలకు బినామీగా ప్రచారం జరిగింది. అవసరమున్నా లేకున్నా ఐదేళ్లలో ట్రాన్స్‌ఫార్మర్లను ఇబ్బడిముబ్బడిగా ఆయా విద్యుత్తు స్టోర్లు, సెక్షన్లలో దింపేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో రైతులకు ఇవ్వాల్సిన కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లను కొందరు వైసీపీ నాయకులు తీసుకెళ్లి బయట అమ్మేశారు. ఇలా భారీ అక్రమాలకు పాల్పడ్డారు. ఇప్పటికీ అధికారులు వాటిని సరిచేయలేకపోతున్నారు. ఇలా 2019–24 మధ్య కాలంలో వైసీపీ చేసిన పాపాలు.. ఇప్పటికీ రైతులకు షాక్ కొడుతున్నాయి. ఎందుకంటే.. అప్పుడొచ్చిన కరెంటు సామగ్రిని ఇప్పుడు ఆ ధరలకే కొనాల్సి రావడం అన్నదాతలకు భారంగా మారింది.

'కూటమి'లో టెండరుకు బ్రేక్!

కూటమి ప్రభుత్వం వచ్చినా ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర మ్యాచింగ్ మెటీరియల్ సరఫరాకు కాంట్రాక్టర్లు గతంలోలాగే అధిక ధరలనే కోట్ చేసినట్లు చెబుతున్నారు. ఇప్పటికే షిరిడీసాయి కంపెనీపై అవినీతి ఆరోపణలు రావడం, ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో టెండర్లకు బ్రేక్ పడినట్లు తెలిసింది. ఐదేళ్లలో ఆ కంపెనీ సరఫరా చేసిన డీటీఆర్(డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్)లు ఎన్ని? సాధారణ ధర ఎంత? కోట్ చేసిన ధర ఎంత? చెల్లింపులు, ఇందులో ఎవరెవరి పాత్ర ఎంత? తదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. మ్యాచింగ్ మెటీరియల్‌పైనా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ లెక్కలన్నీ తేల్చాకే సామగ్రి సరఫరాకు అనుమతివ్వాలని, అంతవరకూ ఆయా స్టోర్లలో అందుబాటులో ఉన్న స్టాకును సర్దుబాటు చేసుకోవాలని విద్యుత్తుశాఖ అధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు చెబుతున్నారు. దీంతో సదరన్ డిస్కం పరిధిలోని ఉమ్మడి ఆరు జిల్లాల పరిధిలో ప్రస్తుతం సామగ్రి సరఫరా ఆగింది.రైతులకు విద్యుత్ సామగ్రి కొరత వ్యవసాయానికి సంబంధించి విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్, ఎక్సిఫీజ్, ఎల్‌టీ ఫీజ్ సెట్, కండెక్టర్, నెట్, బోల్టు, క్రాసారాలు, ఎర్త్‌పైపులు, ఫీజు క్యారీయర్లు, కేబుల్ తదితర మ్యాచింగ్ మెటీరియల్ ఉంటాయి. అన్నీ ఒకేసారి రాకపోవడంతో పనులన్నీ పెండింగ్‌లో ఉంటున్నాయి. కొందరు రైతులు స్తంభాలు నాటుకుని వైరుకోసం చూస్తుంటే.. మరికొందరు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకుని మిగిలిన సామగ్రికోసం ఎదురు చూస్తున్నారు. రైతుకు మంజూరైన అన్ని వస్తువులనూ స్టోర్ నుంచి ఏఈ డ్రా చేసి కాంట్రాక్టర్‌కు ఇస్తేనే క్షేత్రస్థాయిలో పని జరుగుతుంది. సామగ్రి లేకపోవడంతో కాంట్రాక్టర్లు కూడా పనులు మానేశారు. దీంతో రైతులే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు.

## నో డ్రగ్స్ అంటూ 200 మంది విద్యార్థులతో అవగాహనా సదస్సు..

**మూలపాడు 'జిల్లా పరిషత్ హై స్కూల్' నందు విద్యార్థులతో ప్రత్యక్ష అవగాహన కార్యక్రమం నిర్వహించిన యాజమాన్యం..**

**ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం,ఫిబ్రవరి 25(క్రైం కౌంటర్ డెస్క్):**మూలపాడులో డ్రగ్స్ వద్దు బ్రో" కార్యక్రమం విస్తరణ నిర్వహించారు.నో డ్రగ్స్ ఆవరనెస్ ప్రోగామ్ ను సుమారు"200 మందితో విద్యార్థులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ దేవిడ్ రాక్ పెల్లర్,మాట్లాడుతూ ఎన్డిపిఎస్ చట్టం కింద తీవ్రమైన శిక్షల గురించి విద్యార్థులకు స్పష్టంగా తెలియజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

1972 ఈగల్ కాల్ సెంటర్."డ్రగ్స్ మీ గ్రామం, కాలేజీ లేదా ఇంట్లో కనిపిస్తే వెంటనే 1972కి కాల్ చేయండి. మీ వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని . ఇది ప్రజల చేతుల్లో ఉన్న శక్తివంతమైన ఆయుధం, అని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. దేశాన్ని ప్రేమించే ఏ వ్యక్తి కూడా డ్రగ్స్‌ను ముట్టుకోరు, అలా చేసేవారు దేశద్రోహులుగా పిలవబడతారు. కాబట్టి ఎవరు కూడా డ్రగ్స్ సమాజానికి శత్రువు అని తెలియపరుస్తూ ప్రతి ఒక్కరూ నేను సైతం అంటూ మన పరిసర ప్రాంతాల్లో ఎవరైనా సరే ఇలాంటి వాటికి అలవాటు పడి బానిసలుగా ఉన్నట్లుగా మీకు తెలిసినట్లయితే ఈ నెంబర్కు,1972కి కాల్ చేసి ఈ యుద్ధంలో




భాగస్వాములు కావాలి అని ఆయన తెలియపరుస్తూ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీ దేవిడ్ రాక్ పెల్లర్ మరియు ఎన్సీసీ ఏఎన్ఓ ఆదిలక్ష్మి,మరియు పి. డి షేక్ రషీద్ మరియు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గున్నారు.

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించుకునేందుకు 'మార్చి 4న ఛలో విజయవాడ'..

**జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం ఏపీ డాబాల్యూ జె ఎఫ్ ఆధ్వర్యంలో భారీ సభ..**

**పిలుపునిచ్చిన ఏపీ డాబాల్యూ జె ఎఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యేక్షులు ఎస్ వెంకట్రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి. ఆంజనేయులు**



**ఎన్టీఆర్ జిల్లా,ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 25(క్రైం కౌంటర్ డెస్క్):** అర్హులైన జర్నలిస్టులకు ఇల్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మార్చి 4న చలో విజయవాడ కార్యక్రమంలో ప్రతి జర్నలిస్టు పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష,రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి. ఆంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని ప్రజా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఏపీడాబాల్యూజెఎఫ్ డైరీ ని సంఘ సభ్యులతో కలిసి రాష్ట్రా మరియు జిల్లా నాయకులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలననే ఉద్దేశంతో ఏపీడాబాల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా జర్నలిస్టులుగా పనిచేస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఇల్లు, ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వాలు హామీలు ఇస్తున్న వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి జర్నలిస్టుకు మూడు సెంట్లు ఇళ్ల స్థలం కేటాయించడంతోపాటు ఇల్లు కూడా మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కోసం మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వృద్ధాప్యంలో ఉన్న జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంబి నాథన్ మాట్లాడుతూ మార్చి 4న జరిగే ఛలో విజయవాడ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా జాయింట్ సెక్రటరీ మెరుగుమాల రాఘవులు, మైలవరం నియోజకవర్గం అధ్యేక్షులు షేక్ సల్మాన్, కార్యదర్శులు వి. సురేష్, ప్రజా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అడపా శివ, చల్లా రవీంద్ర, ఏపీడాబాల్యూజెఎఫ్ మైలవరం నియోజకవర్గం నాయకులు అవుట్ బాబు, టంగుటూరి శ్రీను, దాసి ప్రతాప్, ఎస్. నాగరాజు, గుంజ నాగరాజు, నరేష్, మేకల భాను, ఎం. రమేష్, వేముల నాగరాజు, వంశీ, బొమ్మ గోపి, పాఠన్ అష్రఫ్,జి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సంక్షోభంలో గ్రంథాలయాలు

**ఉమ్మడి కృష్ణాజిల్లాలో రూ.50 కోట్ల బకాయిలు**

**- స్థానిక సంస్థల నుంచి జమకాని నగదు**

**- రెండు నెలలుగా ఉద్యోగులకు జీతాలు నిల్**

**- పింఛన్లు అందక విశ్రాంత ఉద్యోగుల అవస్థలు**

**- నెలకు జీతభత్యాలకు రూ.1.50 కోట్లు అవసరం**

**- జిల్లా అధికారులు వెంటనే స్పందించాలని వేడుకోలు**



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 25:** మచిలీపట్నం :జిల్లాలోని మునిసిపల్ కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల ద్వారా పన్నులు వసూలు చేసే సమయంలోనే ఎనిమిది శాతం నగదును గ్రంథాలయాల సెస్ రూపంలో తీసుకుంటారు. అలా వసూలు చేసిన నగదును స్థానిక సంస్థలు గ్రంథాలయాలకు చెల్లించాల్సి ఉంది. కానీ నగదును పెండింగ్‌లో పెట్టడంతో గ్రంథాలయాలు ఆర్థికపరంగా చిక్కుల్లో పడిపోయాయి. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికైనా గ్రంథాలయాలకు సెస్ రూపంలో వసూలు చేసిన నగదును విడుదల చేయాలని గ్రం?థాలయసంస్థ అధికారులు కోరుతున్నారు.

రెండు నెలలుగా జీతాలు, పెన్షన్లు బంద్

ఉమ్మడి కృష్ణాజిల్లాలో జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు, ప్రథమశ్రేణి గ్రంథాలయాలు ఏడు, ద్వితీయ శేణి గ్రంథాలయాలు 18, తృతీయ శ్రేణి గ్రంథాలయాలు 83 కలిపి మొత్తంగా 109 గ్రంథాలయాలు ఉన్నాయి. వీటిలో రెగ్యులర్ ఉద్యోగులు 79 మంది, అవుట్ సోర్సింగ్ పద్ధతిపై పనిచేసే ఉద్యోగులు 64 మంది ఉన్నారు. వీరితో పాటు గ్రం?థాలయ సంస్థలో పనిచేసి ఉద్యోగ విరమణ పొంది పెన్షన్ పొందేవారు మరో వంద మందికిపైగా ఉన్నారు. వీరికి రెండు నెలలుగా, జీతాలు, పెన్షన్ నిలిచిపోయింది. ఇప్పటికే రెండు నెలలుగా జీతాలు పెండింగ్‌లో పెట్టగా, మార్చి నెలకు సంబంధించిన జీతాలు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి గ్రంథాలయాలకు రావాల్సిన నగదును విడుదల చేస్తేనే ఏప్రిల్ నెలలో జీతాలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ ఆధికారులు చెబుతున్నారు.

రూ.50 కోట్లకుపైగా బకాయిలు

మచిలీపట్నం, విజయవాడ మునిసిపల్ కార్పోరేషన్‌లతో పాటు, పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో వసూలు చేసే పన్నులతో కలిపే గ్రం?థాలయాల సెస్‌ను వసూలు చేస్తారు. ఇలా వసూలు చేసిన నగదును ఎప్పటికపుడు గ్రంథాలయ సంస్థకు జమ చేయాల్సి ఉంది. కానీ ఇవేమీ సకాలంలో చెల్లించడంలేదు. దీంతో గ్రం?థాలయాల సంస్థ ఖజానా ఖాళీ అయ్యింది. 2025 జనవరి నుంచి డిసెంబరు వరకు ఉమ్మడి కృష్ణాజిల్లాలోని స్థానిక సంస్థల నుంచి రూ.4.48 కోట్లు మాత్రమే గ్రంథాలయ సంస్థకు చెల్లించారు. మరో రూ.50 కోట్లు పెండింగ్‌లోనే ఉంచారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రూ.30 కోట్లు, గుడివాడ పురపాలక సంఘం నుంచి రూ.2కోట్లు, మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ నుంచి రూ.60 లక్షలు, మిగిలిన నగదు గ్రామ పంచాయతీల నుంచి చెల్లింపులు చేయాల్సి ఉందని గ్రం?థాలయసంస్థ అధికారులు చెబుతున్నారు.

నిధుల కొరతతో ఇక్కట్లు

గ్రం?థాలయ సంస్థకు రూ.50 కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోవడంతో అన్ని గ్రం?థాలయాల్లో కనీస పారిశుధ్య చర్యలు చేపట్టేందుకు కూడా అవకాశం లేని పరిస్థితి నెలకొంది. విద్యుత బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. స్వీపర్లకు కూడా జీతాలు చెల్లించలేకపోతున్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల డిమాండ్‌ను బట్టి మార్కెట్‌లోకి నూతనంగా వచ్చే పుస్తకాలను కొనుగోలు చేసి గ్రం?థాలయాల్లో అందుబాటులో ఉంచాలి. నిధుల లేమి కారణంగా నూతన పుస్తకాల కొనుగోలును నిలిపివేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రామవరప్పాడు, పటమటలంక, ఎ–కొండూరు, బంటుమిల్లి, బాపులపాడు, మానికొండ, మండవలి,?ల హెచ్‌బీకాలనీ, కొండపల్లిలో శాఖా గ్రం?థాలయాల భవనాల నిర్మాణాల కోసం భూమిని సేకరించాల్సి ఉ ంది. పెనమలూరు, వణుకూరులో గ్రంథాలయ భవనాల నిర్మాణం కోసం భూమిని కేటాయిస్తూ పంచాయతీలు తీర్మానం చేసి ఇచ్చినా ఆర్థిక వనరులు అందుబాటులో లేకపోవడంతో ఈ భవనాల నిర్మాణం ప్రారంభించనే లేదు. జిల్లా అధికారులు స్పందించి గ్రంథాలయాలకు రావాల్సిన బకాయిలను వెంటనే జమ చేయించి, పెండింగ్‌లో ఉన్న జీతాలు, పెన్షన్ ఇప్పించాలని గ్రంధాలయసంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, పెన్షనర్లు కోరుతున్నారు.

# ఏలూరు కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై నిలబడి అంగన్‌వాడీల దీక్షలు

**మోకాళ్లపై నిలబడి అంగన్వాడీల దీక్షలు**

**వేధింపుల అధికారిపై చర్యలు తీసుకోవాలని వీఆర్వోల ఆందోళన**

**ఇళ్ల మధ్య బార్ వద్దంటూ రహదారిపై బైఠాయించిన మహిళలు**

**భీమవరం కలెక్టరేట్ వద్ద విద్యుత్ మీటర్ రీడర్ల ధర్నా**

**ఖాళీలు భర్తీ చేయాలని ఆదివాసీ ఉద్యోగుల సంఘం నిరసన**

**సీఎం సార్ మా గోడు వినండి..**



ఏలూరు రూరల్, ఫిబ్రవరి 25 ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు బుధవారం నిరసనల తో హోరెత్తాయి. అంగన్వాడీలు తమ సమస్యల్ని పరిష్క రించాలంటూ ఏలూరు కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై నిల బడి నిరసన తెలపగా భీమవరం లోని ప్రకాశం చౌక్ వద్ద అంగన్వాడీలు నిరసన తెలిపా రు. గతంలో తాము అడ్డుకున్నా మరలా బార్ ఏర్పాటు కు సన్నాహాలు చేస్తు న్నారంటూ ఏలూరు దక్షిణపు వీధి వద్ద మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వి?ధుల పేరుతో తీవ్ర వేధింపులకు గురిచేస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలని బుట్టాయగూడెంలో వీఆర్వోలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతంలో వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీలు భర్తీ చేయాలంటూ ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాజమండ్రి రీజనల్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేసింది. విద్యుత్ మీటర్ల రీడర్స్‌కు ఎస్క్రో ఎక్కౌంట్ ద్వారా జీతాలు ఇవ్వాలంటూ భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి జేసీకి వినతిపత్రం అందించారు.

సీఎం సార్ మాగోడు వినండి.. హామీ నిలబెట్టుకోండి అంటూ అంగన్‌వాడీ వర్కర్లు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూని యన్ ఆధ్వర్యంలో వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏలూరు కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో రెండోరోజు బుధవారం మోకాళ్లపై నిలబడి వినూత్న నిరసన తెలిపారు. ఆరేళ్లుగా అంగన్‌వాడీ లకు ఒక్కరూపాయి కూడా వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మే నెల పూర్తిగా సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు రమాదేవి, రంగమ్మ, విజయలక్ష్మి, దుర్గ, ఆదిలక్ష్మి, మల్లిక, రేవతి, నవతి, సీఐటీయూ నాయకులు ఎం. ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: పేదరికాన్ని గుర్తించకుండా పాల కులు నటిస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే రాజా రామ్మోహన్‌రాయ్ ఆరోపించారు. బుధవారం భీమవరం ప్రకాశం చౌక్‌లో అంగన్‌వాడీల వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రెండో రోజు రిలే దీక్షలను ఆయన ప్రారం భించి మాట్లాడుతూ దేశంలో అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని వేతనాలు దారుణంగా పడి పోయాయ న్నారు. అంగన్‌వాడీల సంఘం జిల్లా నాయకులు కే ఝాన్సీ లక్ష్మి, ఎండీ హస్సేన్ మాట్లాడారు. ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మి, లారెన్స్ కుమారి మద్దతు తెలిపారు. సీఐటీయూ జిల్లా నాయ కులు ఎం.ఆంజనేయులు, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు పి. నాగరత్నం, శ్యామల రాణి, రామకోటి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య బార్ వద్దు..

ఏలూరు: నగరంలో పలు డివిజన్ల ఇళ్ల మధ్య గల దక్షిణపువీధి చిరంజీవి బస్‌షెల్టర్ సమీపంలో బార్ ఏర్పాటు చేయవద్దంటూ ప్రజా సంఘాలు, మహిళలు రోడ్డుపై బైఠాయించారు. స్థానికంగా టెంట్ వేసుకుని నిరసన చేపట్టారు. చాలాకాలం క్రితం ఇక్కడే మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని అడ్డుకున్నామని... ఇటీవల బార్ ఏర్పాటుకు అనుమతి తెచ్చుకుని, రాత్రి వేళ్లలో కంటైనర్ దించి, సరుకు తెచ్చుకోవడాన్ని గుర్తించిన మహిళలు అక్కడకు చేరుకుని నిర్వాహకులను నిలదీసినట్లు సమాచారం. కాగా బుధవారం ఉదయం వివిధ సంఘాల నేతలు పుప్పాల కన్న బాబు, నగిరెడ్డి నరేష్, కోన మాణిక్యం, రంగముత్యాలు, చెల్లాయమ్మ తదితరుల ఆధ్వర్యంలో మహిళలు రోడ్డుపై బైఠాయించారు. పలు కాలనీలు, ఆలయాలకు, వెళ్లే దారి ఇదేనని, ఉన్నతాధికారులు స్పందించి బార్ ఏర్పాటును నిలువరించాలని కోరారు.

వేధింపుల అధికారిపై చర్యలు తీసుకోవాలి : వీఆర్వోలు

బుట్టాయగూడెం: వి?ధుల పేరుతో తీవ్ర వేధింపు లకు గురిచేస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలని వీఆర్వోలు బుధవారం తహసీల్దార్ వద్ద ధర్నా చేశారు. కేవీపీఎస్ నాయకుడు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడు తూ వీఆర్వోల పట్ల తహసీల్దార్ అవమానకరంగా మాట్లాడేవారని, దిగువ కులస్థులంటూ వేధించే వారని, మహిళా వీఆర్వోల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవారని ఆరోపించారు. వేధింపులకు గురి చేసిన అధికారిపై అట్రాసిటీ కేసు నమోదుచేసి విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వీఆర్వోలు, వీఆర్ఏలు, సర్వేయర్లు పాల్గొన్నారు.విద్యుత్ మీటర్ రీడర్ల ఆందోళన

భీమవరం టౌన్: విద్యుత్ మీటర్ రీడర్లకు ఎస్క్రో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని విద్యుత్ మీటర్ రీడర్ల జిల్లా గౌరవాధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విద్యుత్ మీటర్ రీడర్ల యూనియన్ బుధవారం భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఎస్క్రో ద్వారా వేతనాలు చెల్లించాలని, విద్యుత్ శాఖ ఉన్నతా ధికారులు ఇచ్చిన ఆదేశాలు అమలు చేయకుండా వేతనాల చెల్లింపులో పీఎఫ్, ఈఎస్ఐ అమలులో కాంట్రాక్టర్లు తీవ్ర అవినీతికి పాల్పడుతూ మీటర్ రీడర్లకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. యూనియన్ భీమవరం డివిజన్ అధ్యక్షుడు పెనుమాక జాకబ్ మాట్లాడారు. తొలుత విద్యుత్ ఎస్ఈ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి ఇన్‌చార్జి ఏడీఈ కె.మధుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ వరకు భారీ మోటార్ సైకిల్ ర్యాలీగా వెళ్ళి ధర్నా నిర్వహించి జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఏజెన్సీలో పోస్టులు భర్తీ చేయాలి

వేలేరుపాడు: పదేళ్లుగా ఏజెన్సీ ప్రాంతంలో వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీలు భర్తీ చేయకపోవడంతో ఇబ్బం దులు ఏర్పడుతున్నాయని, ఖాళీలు భర్తీ చేయాలని ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసి యేషన్ రాజమండ్రి రీజనల్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ఆదివాసీ వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగ సంఘం నాయకులు ఆందోళన చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు తుష్టి జోగారావు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు సున్నం శ్రీరాము లుదొర మాట్లాడుతూ ఏజెన్సీలో వైద్యులు, హెల్త్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్‌నర్సు పోస్టులు ఖాళీగా ఉండటంతో అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులపై భారం పడుతోందన్నారు. దీంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలంటే ఇబ్బందిగా ఉందని తెలిపారు. త్వరలో ప్రకటించబోయే జాబ్ క్యాలెండర్‌లో ఆదివాసీ ప్రాంతాల్లోని పోస్టులను స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రీజనల్ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

# అమెరికా ఒత్తిడికి ప్రధాని మోదీ లొంగిపోయారన్న రాహుల్ గాంధీ



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 25:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం కోసం ప్రధాని మోదీ దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని, అమెరికా ఒత్తిడికి పూర్తిగా లొంగిపోయారని ఆయన ఆరోపించారు. మంగళవారం భోపాల్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'మహా కిసాన్ సమ్మేళన్'లో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం, రాబోయే ఐదేళ్లలో భారత్ అమెరికా నుంచి రూ.9 లక్షల కోట్ల విలువైన వస్తువులను కొనుగోలు చేయాల్సి ఉంటుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దీనివల్ల దేశీయ పరిశ్రమలు, ముఖ్యంగా వ్యవసాయ, టెక్స్‌టైల్ రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. టెక్స్‌టైల్ రంగాన్ని ఇప్పటికే నాశనం చేశారు. బంగ్లాదేశ్‌కు సున్నా శాతం సుంకాలు ఇచ్చిన అమెరికా, తమ నుంచి పత్తి కొనాలంటూ భారత్‌పై ఒత్తిడి తెస్తోందిఅని రాహుల్ విమర్శించారు.''తన రాజకీయ భవిష్యత్తును, వ్యక్తిగత ఇమేజ్‌ను కాపాడుకోవడానికే నరేంద్ర మోదీజీ ఒత్తిడికి తలొగ్గారు" అని రాహుల్ ఆరోపించారు. ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని ఆయన ప్రధానిని డిమాండ్ చేశారు. ఈ ఒప్పందానికి సంబంధించి ఈమెయిళ్లు, వీడియోలతో సహా కీలక ఆధారాలు తన వద్ద ఉన్నాయని, వాటిని ఇంకా బయటపెట్టలేదని ఆయన తెలిపారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా తలపెట్టిన కిసాన్ సమ్మేళనాలకు ఈ సభతో శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా పాల్గొన్నారు. ఈ ఒప్పందం వల్ల పత్తి, సోయాబీన్, మొక్కజొన్న వంటి పంటలకు ప్రమాదం వాటిల్లుతుందని, రైతుల జీవనోపాధి దెబ్బతింటుందని కాంగ్రెస్ నేతలు వాదిస్తున్నారు. మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లో త్వరలో ఇలాంటి సభలు నిర్వహించనున్నారు.

# జ్యోతిష్యం పేరుతో ఘోరం..




**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 25:** తమిళనాడులోని శివగంగ జిల్లాలో మానవత్వం సిగ్గుపడే ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. చదువులో వెనకబడ్డారనే కారణంతో కన్నతల్లి తన ఇద్దరు కుమార్తెలను ఓ జ్యోతిషుడి వద్దకు తీసుకెళ్లగా, ఆ మృగాడు వారి జీవితాలను చిన్నాభిన్నం చేశాడు. 2021లో జరిగిన ఈ హేయమైన ఘటనపై విచారణ చేపట్టిన ప్రత్యేక పోక్సో కోర్టు, నిందితుడు రామకృష్ణన్‌ను దోషిగా తేలుస్తూ అత్యంత కఠినమైన తీర్పును వెలువరించింది. సమాజంలో భక్తి, నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని అఘాయిత్యాలకు పాల్పడేవారికి ఈ తీర్పు ఒక హెచ్చరికగా నిలిచింది.

బాధితుల వివరాల్లోకి వెళ్తే.. 14 మరియు 17 ఏళ్ల వయసున్న ఇద్దరు అక్కాచెల్లెళ్లు సరిగ్గా చదువుకోవడం లేదని ఆందోళన చెందిన వారి తల్లి, సమస్య పరిష్కారం కోసం రామకృష్ణన్ అనే జ్యోతిషుడిని ఆశ్రయించింది. దీనిని అదునుగా తీసుకున్న నిందితుడు, గ్రహ దోషాలు ఉన్నాయని నమ్మబలికి పరిహార పూజల పేరుతో ఆ బాలికలపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. పూజల సాకుతో పవిత్రమైన నమ్మకాన్ని వమ్ము చేస్తూ ఆ చిన్నారుల శారీరక, మానసిక స్థితిని దెబ్బతీశాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కటకటాల్లోకి నెట్టారు.

ఈ కేసును విచారించిన శివగంగ పోక్సో కోర్టు న్యాయమూర్తి, నేరం అత్యంత క్రూరమైనదిగా పరిగణించి చారిత్రాత్మక తీర్పును ఇచ్చారు. నిందితుడు రామకృష్ణన్‌కు ఏకంగా 200 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా రూ. 2 లక్షల జరిమానాను కూడా విధించారు. సాధారణంగా ఇలాంటి కేసుల్లో శిక్షలు పదేళ్లు లేదా జీవిత ఖైదుగా ఉంటాయి, కానీ నేరం యొక్క తీవ్రతను బట్టి జ్యోతిషుడికి మరణం వరకు జైలులోనే ఉండేలా ఈ భారీ శిక్షను ఖరారు చేయడం విశేషం.

న్యాయస్థానం కేవలం శిక్షతోనే ఆగకుండా బాధితుల భవిష్యత్తుపై కూడా కీలక ఆదేశాలు జారీ చేసింది. అత్యాచారానికి గురైన ఇద్దరు బాలికలకు తక్షణమే చెరో రూ. 10 లక్షల చొప్పున మొత్తం రూ. 20 లక్షల నష్టపరిహారాన్ని అందజేయాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ పరిహారం వారి ఉన్నత చదువులకు, మానసిక కోలుకోవడానికి కొంతవరకు సహకరిస్తుందని కోర్టు అభిప్రాయపడింది. మూఢనమ్మకాలతో పిల్లలను అపరిచితుల వద్దకు పంపడం ఎంత ప్రమాదకరమో ఈ ఘటన మరోసారి రుజువు చేసింది.

# పది పరీక్షల అధికారులకు విధుల కేటాయింపులో గందరగోళం



**క్రైం కౌంటర్ న్యూస్,** ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 25 పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ సిబ్బంది నియామకాల్లో ఈ ఏడాది కొత్తగా అమల్లోకి తెచ్చిన ఆటోమేషన్ విధానం ఆదిలోనే క్షేత్రస్థాయిలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ముచ్చెమటలు పుట్టిస్తోంది. ప్రస్తుతం పని చేస్తున్న స్కూలు ప్రాంతం నుంచి 50 నుంచి 60 కిలోమీటర్ల దూరం వరకు టెన్త్ పరీక్షల నిర్వహణకు విధులు కేటాయిస్తూ బుధవారం పాఠశాల విద్య కమిషనరేట్ నుంచి నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. విద్యాశాఖ నిర్వహిస్తున్న లీప్ యాప్ నుంచే నేరుగా సంబంధిత హెచ్‌ఎంలు, టీచర్ల మొబైల్ ఫోన్లకు జారీ అయిన అపాయింట్‌మెంట్ ఆర్డర్లు చూసుకుని లబోదిబోమంటు న్నారు. ఇక మరికొద్ది రోజుల్లో జరగనున్న ఇన్విజిలేటర్ల నియామకాల పైనా ఆటోమేషన్ ప్రభావం ఎలా ఉంటుం దోనన్న ఆందోళన టీచర్లలో నెలకొంది.

సీఎస్, డీవోల నియామకాలన్నీ గందరగోళమే

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు జరగనున్నాయి. జిల్లాలో ఈ పరీక్షలకు మొత్తం 24,019 మంది బాలబాలికలు దరఖాస్తు చేసుకోగా, పరీక్షలు 133 కేంద్రాల్లో జరగనున్నాయి. ప్రతీ పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ (డీవో)లను నియ మిస్తారు. పరీక్ష నిర్వహణలో వీరిద్దరిదీ కీలకపాత్ర. పరీక్ష కేంద్రంలో సమగ్ర ఏర్పాట్లను చేసుకోవడం, పరీక్షలు జరిగే రోజుల్లో విద్యాశాఖ రోజువారీ నిర్వహించే సెట్ కాన్ఫరెన్సుకు హాజరుకావడం, ఉన్నతాధికారులిచ్చే సూచనలు, ఆదేశాల అమలుకు కేంద్రంలో ఏర్పాట్లు చేసుకోవడం, ముఖ్యంగా పరీక్ష ప్రారంభ సమయానికి ముందుగా సంబంధిత పోలీసుస్టేషన్‌కు వెళ్లి ప్రశ్నపత్రాల బండిళ్లను పరీక్ష కేంద్రానికి భద్రంగా తీసుకురావడంలో వ్యక్తిగత బాధ్యత తీసుకోవడం, పరీక్ష నిర్వహణ సిబ్బంది అయిన ఇన్విజిలేటర్ల నుంచి వివరాలు తీసుకోవడం, మిగ తా శాఖలైన పోలీసు, వైద్యఆరోగ్యశాఖ, శానిటేషన్, మున్సి పల్/పంచాయతీరాజ్ సిబ్బంది విధులను పర్యవేక్షించడం, సమన్వయం చేసుకోవడం తదితర విధులన్నీ సీఎస్, డీవో లు చూసుకోవాల్సి ఉంటుంది. ఆ ప్రకారం పరీక్ష కేంద్రాని కి మిగతా సిబ్బంది కంటే ముందుగా సీఎస్, డీవోలే చేరుకోవడం, పరీక్ష ముగిసిన తర్వాత జవాబుపత్రాల బండిళ్లను పోస్టాఫీసులో పార్సిల్ చేసే వరకు వీరిద్దరూ ఒకరికొకరు సమన్వ యంతో బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. దీనికను గుణంగానే పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 6 నుంచి 7 గంటల్లోగా వీరు కేంద్రానికి చేరుకోవాలి. ఇన్ని కీలక బాధ్యతలున్న సీఎస్, డీవోలను సాధా రణంగా ప్రస్తు తం పనిచేస్తున్న స్కూలు ప్రాంతం నుంచి గరిష్ఠంగా 30 కిలోమీటర్ల దూరానికి లోబడి నియమిస్తుంటారు. దీనికి భిన్నంగా విద్యాశాఖ ఈ ఏడాది నుంచి టెన్త్ పరీక్షల సిబ్బందికి విధుల కేటాయింపునకు ప్రవేశ పెట్టిన ఆటోమేషన్ విధానం పూర్తిగా మార్చివేసింది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా తనవద్దవున్న టీచర్ల సమాచారం (టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం--టిస్) ఆధారం గా జిల్లా విద్యాశాఖతో సంబంధం లేకుండా, క్షేత్ర స్థాయిలో దూరాభారంతో నిమిత్తం లేకుండా అపాయింట్‌మెంట్ ఆర్డర్లు జారీ చేయడంతో ఒక్క సారిగా నిరసనలు తలెత్తాయి. టిస్ సమాచారం ఆధారంగా పరీక్షల సిబ్బంది నియామకాలను ర్యాండమ్‌గా చేసినపుడు క్షేత్రస్థాయిలో దూరాభారాలను పరిగణనలోకి తీసుకుంటే ఈ దుస్థితి వచ్చేదికా దని ఉపాధ్యాయవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా యి.

దిద్దుబాటలో విద్యాశాఖ సీఎస్, డీవో/ఏడీవోల నియామకాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను గమనించకుండా బుధవారం అపాయిం ట్‌మెంట్ ఆర్డర్లు జారీ చేయడాన్ని నిరసిస్తూ ఏపీ హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్లపట్ల మురళీకృష్ణ, ఫ్యాప్టో జిల్లా చైర్మన్ గగ్గులోతు మోహన్ డీఈవో వెంకటలక్ష్మమ్మను, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆశను కలుసుకుని అభ్యంతరాలను తెలిపారు. లోపాలను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆశను వివరణ కోరగా.. 'సుదూర ప్రాంతాలకు సీఎస్, డీవోల నియామకాలు జరిగాయని మా దృష్టికి వచ్చింది. ఇటువంటివి పరిశీలించేందుకు గురువారం సాయంత్రం 5 గంటల్లోగా తగిన ఆధారాలతో డీఈవో కార్యాల యానికి అభ్యర్థనలు పంపాలని సూచించాం. సహేతుకంగా వున్న అభ్యర్థనలను సరిదిద్దేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తా'మన్నారు.


# సినిమా



## తిరుమల శ్రీవారి దర్శనంపై వివాదం.

అంజాజీపేట మ్యారేజ్ బ్యాండు సినిమాతో హీరోయిన్ గా పరిచయమైంది శివానీ నగరం. అంతకు ముందు పలు షార్ట్స్ ఫిల్మ్స్ లో నటించిన ఈ ముద్దుగుమ్మ మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇక ఆమె నటించిన రెండో సినిమా లిటిల్ హార్ట్స్ సూపర్ హిట్ గా నిలిచింది. ఇందులో శివానీ పోషించిన కాత్యాయని పాత్ర బాగా హైలెట్ అయ్యింది. ఇక లేటెస్ట్ గా హే బలవంత్ అనే సినిమాతో మరోసారి ఆడియెన్స్ ను పలకరించిన ఈ అందాల తార ఇటీవల అనుకోకుండా ఓ వివాదంలో చిక్కుకుంది. తిరుమలలో తనకు 15 నిమిషాల పాటు శ్రీవారి దర్శన భాగ్యం కల్పించారని ఓ ఇంటర్వ్యూలో శివానీ చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం రేపాయి. దీనిపై సామాన్య భక్తుల నుంచి కూడా విమర్శలు వచ్చాయి. దీంతో ఈ వివాదంపై క్లారిటీ ఇస్తూ మరో వీడియోను రిలీజ్ చేసింది శివాని.కొన్నిరోజుల క్రితం ఓ యూట్యూబ్ ఛానెల్‌కి నేను ఇంటర్వ్యూ ఇచ్చాను. నా చైల్డ్ హుడ్ జర్నీ, సినిమా కెరీర్ తో పాటు భక్తి, ఆధ్యాత్మికతకు సంబంధించి చాలా విషయాలు అందులో మాట్లాడాను. అందులో భాగంగానే కేదార్నాథ్, రామకోటి రాయడం, షిరిడి, తిరుమల తిరుపతి శ్రీవారి ఆలయాల గురించి మాట్లాడాను. కానీ అందులో కేవలంనేను తిరుమలలో 15 నిముషాలు దర్శనం తీసుకున్నాను అని చెప్పింది మాత్రమే హైలెట్ అవుతుంది. దానికి క్లారిటీ ఇవ్వడానికి నేను ఈ వీడియో చేస్తున్నా. 2025 అక్టోబర్ లో 10,500 రూపాయలు కట్టి శ్రీవాణి దర్శనం టికెట్స్ నేను మా అమ్మ లైన్లో నిల్చొని తీసుకున్నాం. ఆ తర్వాత శ్రీవారి దర్శనం చేసుకున్నాం. తిరుమల ఆలయంలో క్యూ లైన్‌లో మొదటి నుంచి స్వామి దగ్గరకు వెళ్లేంత వరకు కొంచెం కొంచెం స్వామి వారు కనిపిస్తుంటారు. నేను ఆ సమయం ఆ మొత్తం 15 నిమిషాలు ఉంటుందని అంచనాతో అలా చెప్పాను. అంతే కానీ 15 నిముషాలు నన్ను ఎవరూ టచ్ చేయలేదు అని కాదు'నేను చాలా సార్లు రూ.300 టికెట్ తీసుకుని కుటుంబంతో కలిసి తిరుమల వెళతాను. అప్పుడు కేవలం 5 సెకన్ల పాటు స్వామిని చూస్తాను. నా జీవితంలో తొలిసారి 13 ఏళ్ల తర్వాత స్వామిని అంత సమీపం నుంచి చూశాను. ఇది నేను ఎంతో సంతోషంగా భావించి ఆత్రుతతో ఆ విషయాన్ని పంచుకున్నాను అంతే. అయితే అది కొంచెం మిస్ లీడింగ్‌గా వెళ్తోంది. నాకే కాదు మీలో ఎవరైనా సరే శ్రీవాణి దర్శనం టికెట్ తీసుకొని వెళ్తే కచ్చితంగా స్వామివారి దర్శనం దగ్గరగా, చాలా మంచిగా జరుగుతుంది. నాలాగే మీరు కూడా మంచి అనుభూతి చెందుతారు. దీనిపై క్లారిటీ ఇవ్వాలి అనేది నా బాధ్యత. ఇది నా టికెట్' అంటూ తన శ్రీవాణి దర్శనం టికెట్ కూడా చూపించింది శివాని. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది.





## షుగర్ ఉన్నవారు మామిడిపండు తింటే ఏమవుతుంది..?

మామిడి సీజన్ వచ్చిందంటే చాలు.. ఆ మధుర ఫలాలను చూసి నోరు ఊరని వారుండరు. కానీ మధుమేహ వ్యాధిగ్రస్తులు మాత్రం అబ్బే మామిడి తింటే షుగర్ లెవల్స్ పెరిగిపోతాయి అనే భయంతో ఆ అమృతాన్ని దూరం పెడుతుంటారు. అయితే మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇప్పుడు ఒక తీపి కబురు అందింది. మామిడి పండ్లు తినడం వల్ల షుగర్ పెరగడం పక్కన పెడితే కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయని తాజా పరిశోధనలు చెబుతున్నాయి.నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. టైప్-2 డయాబెటిస్ ఉన్నవారు సరైన పద్ధతిలో మామిడి తింటే అది వారి ఆరోగ్యానికి మేలు చేస్తుందని తేలింది.ఏమిటా పరిశోధన?

సుమారు ఎనిమిది వారాల పాటు నిర్వహించిన ఈ అధ్యయనంలో పరిశోధకులు కొన్ని ఆసక్తికరమైన అంశాలను గుర్తించారు. రోజువారీ అల్పాహారంలో కేలరీలు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారానికి బదులుగా మామిడిని తీసుకున్న వారిలో చక్కెర స్థాయిలు పెరగకపోగా, నియంత్రణలో ఉన్నట్లు గమనించారు. మామిడి తినడం వల్ల శరీరంలో మంచి కొలెస్ట్రాల్ పెరిగి గుండె ఆరోగ్యం మెరుగుపడిందని తేలింది. సరైన పరిమాణంలో తీసుకున్నప్పుడు ఇది బరువు పెరగకుండా చేయడంలో కూడా సహాయపడింది.

ఎలా తింటే సురక్షితం?

మామిడి పండు తింటే షుగర్ పెరుగుతుందా లేదా అనేది మీరు ఎంత తింటున్నారు, ఎలా తింటున్నారు..? అనే దానిపై ఆధారపడి ఉంటుంది.

రోజుకు 250 గ్రాముల కంటే ఎక్కువ మామిడి పండును తీసుకోకూడదు.

మామిడి తిన్న రోజున, మీరు తీసుకునే ఇతర కార్బోహైడ్రేట్లు, స్టార్చ్ ఉన్న ఆహారాన్ని తగ్గించాలి.


బిర్యానీలు లేదా స్వీట్లు తిన్న తర్వాత మామిడి పండు తింటే మాత్రం షుగర్ లెవల్స్ అకస్మాత్తుగా పెరిగే ప్రమాదం ఉంది.

మామిడిలో దాగున్న పోషక విలువలు

మామిడి కేవలం రుచికి మాత్రమే కాదు, ఇది పోషకాల గని కూడా..

ఖనిజాలు: పొటాషియం, ఐరన్ లభిస్తాయి.

యాంటీఆక్సిడెంట్లు: శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచే యాంటీఆక్సిడెంట్లు ఇందులో మెండుగా ఉన్నాయి.



## ఈ ఆకులు ఉండగా..

ప్రస్తుతం రోజుల్లో అందరూ ఎవరు పనుల్లో వారు చాలా బిజీగా ఉన్నారు. కొందరికి పని ఒత్తిడి వలన ఫుడ్ సరిగా తినరు. దీని వలన అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. వాటిలో అందరూ ఎదుర్కొంటున్న సమస్య జీర్ణక్రియ పనితీరు మందగించడం. పనిలో పడి ఇంట్లో చేసుకుని తినే సమయం లేక బయట లభించే ఫాస్ట్ ఫుడ్స్ , ఆయిల్ ఫుడ్స్, మొబైల్ ఎక్కువగా వాడటం ఇలాంటి అలవాట్ల వలన జీర్ణవ్యవస్థ పాడయ్యే అవకాశం ఉంది. ఇవి మాత్రమే కాకుండా గ్యాస్, కడుపు నొప్పి, నిద్ర లేమి వంటి సమస్యలు ఈ రోజుల్లో చాలా కామన్ అయిపోయింది.జీర్ణవ్యవస్థ

బయట ఫుడ్స్ తినడం వలన కొందరికి విపరీతమైన కడుపునొప్పి వస్తుంది. ఇది ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తోంది. తిన్న ఫుడ్స్ జీర్ణం కాకపోతే శరీరానికి తగిన పోషకాలు సరిగా అందకుండా పోతాయి. దాని వలన ఇతర సమస్యలు కూడా వస్తాయి. ఇంకా నీరసం, వాంతులు వంటి సమస్యలు కూడా వస్తాయి. దీని కోసం మీరు హాస్పిటల్??కి వెళ్లాల్సిన అవసరం లేదు. మన ఇంటి దగ్గర దొరికే తమలపాకును తింటే చాలు. ఈ సమస్యలకు చెక్ పెట్టొచ్చు.

తమలపాకు జ్యూస్ రూపంలో కానీ నమలడం వలన కానీ జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. నిజం చెప్పాలంటే ఇది మంచి మెడిసిన్. తమలపాకును నోటిలోవేసుకున్నప్పుడు లాలాజలం వస్తుంది. ఇది ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడానికి సహాయం చేస్తుంది. ఇప్పటికి ఊర్లలో ఈ ఆకులు కనిపిస్తే చాలు నోట్లో వేసుకుని నములుతూనే ఉంటారు.ఎందుకంటే, దీనిలో సహజ సుగంధ ద్రవ్యాలు అధికంగా ఉంటాయి. ఇవి ఎంతటి నొప్పిని అయినా ఇట్టే తగ్గిస్తాయి. ఇంకా ఇవి వాత సమస్యలకు కూడా చెక్ పెడుతుంది. కాబట్టి, వీటిని ఇప్పటి నుంచి తినడం అలవాటు చేసుకోండి. మొదట్లో చేదుగా ఉన్నా తినగా తినగా మంచి టేస్ట్ వస్తుంది.

## రీఎంట్రీకి సిద్ధమైన డేంజరస్ ప్లేయర్?

భారత స్టార్ బ్యాట్స్‌మన్ రింకు సింగ్ తన తండ్రి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి టీమిండియా క్యాంప్‌ను విడిచి ఇంటికి వెళ్లిపోయాడు. అయితే టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8 దశలో జింబాబ్వేతో జరిగే కీలక మ్యాచ్‌కు ముందు రింకు తిరిగి జట్టుతో చేరనున్నట్లు భారత బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ బుధవారం స్పష్టం చేశారు.చెన్నైలో ఉన్న భారత జట్టు క్యాంప్‌ను వదిలి రింకు సింగ్ మంగళవారం సాయంత్రం ఇంటికి వెళ్లాడు. తన తండ్రి అనారోగ్యం తీవ్రంగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నాడు. అయితే ప్రీ-మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన సితాంశు కోటక్, రింకు బుధవారం సాయంత్రానికే తిరిగి జట్టులో చేరనున్నాడని వెల్లడించారు. గురువారం జరిగే జింబాబ్వే మ్యాచ్‌కు ముందు అతను అందుబాటులో ఉంటాడని తెలిపారు.

రింకు సింగ్ తండ్రి స్టేజ్-4 లివర్ క్యాన్సర్‌తో బాధపడుతూ ప్రస్తుతం వెంటిలేటర్ సపోర్ట్‌పై ఉన్నారు. ఈ కారణంగానే రింకు అత్యవసరంగా ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. ప్రీ-మ్యాచ్ మీడియా సమావేశంలో కోచ్ కోటక్ మాట్లాడుతూ, "రింకు తండ్రికి ఆరోగ్యం బాగోలేదు. అందుకే అతను ఇంటికి వెళ్లాడు. కానీ ఈరోజు సాయంత్రం తిరిగి జట్టుతో చేరతాడని అనుకుంటున్నాను," అని చెప్పారు.

ఇక మరోవైపు, సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఘోర పరాజయం తర్వాత టీమిండియా తీవ్ర ఒత్తిడిలో ఉంది. టాప్ ఆర్డర్ వైఫల్యం, నెట్ రన్ రేట్ (-3.80) భారీగా పడిపోవడం వల్ల జింబాబ్వేతో జరిగే సూపర్-8 రెండో మ్యాచ్‌లో భారీ తేడాతో గెలవడం భారత్‌కు చాలా కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించకపోతే సెమీఫైనల్ అవకాశాలు ప్రమాదంలో పడే పరిస్థితి ఉంది.

ఈ వరల్డ్ కప్‌కు ముందు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మల అద్భుతమైన ప్రారంభాలతో భారత్ హోం సిరీస్‌లలో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లపై ఆధిపత్యం చెలాయించింది. కానీ ప్రస్తుతం అభిషేక్ శర్మ కడుపు ఇన్ఫెక్షన్‌తో బాధపడడంతో అతని ఫామ్ తగ్గినట్లు కనిపిస్తోంది.



## 3 మార్పులతో బరిలోకి భారత జట్టు..

సెమీ ఫైనల్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే జింబాబ్వేపై భారీ విజయం టీం ఇండియాకు అనివార్యం. ఈ కీలక మ్యాచ్ కోసం భారత జట్టులో మూడు మార్పులు చోటు చేసుకోనున్నాయి. తిలక్ వర్మ స్థానంలో సంజు శాంసన్, వాషింగ్టన్ సుందర్ స్థానంలో అక్షర్ పటేల్, రింకు సింగ్ స్థానంలో కుల్దీప్ యాదవ్ ఆడే అవకాశం ఉంది. రింకు వ్యక్తిగత కారణాలతో ఇంటికి వెళ్లడంతో సందిగ్ధత నెలకొంది.టీ20 ప్రపంచ కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన టీం ఇండియా ప్రస్థానం ఉత్కంఠగా మారింది. ప్రతి మ్యాచ్ చావో రేవో అన్నట్లుగా మారడంతో జట్టు సెమీ ఫైనల్ చేరాలంటే కేవలం గెలుపుతో పాటు అదృష్టం కూడా తోడవ్వాలి. ముఖ్యంగా దక్షిణాఫ్రికా చేతులో ఎదురైన 76 పరుగుల ఘోర పరాజయం భారత్ నెట్ రన్ రేట్‌ను మైనస్‌లోకి నెట్టేసింది. ఈ పరిస్థితుల్లో భారత జట్టుకు గండం గట్టెక్కాలంటే జింబాబ్వేపై సాధారణ విజయం సరిపోదు. ఒక భారీ విధ్వంసం సృష్టించి, జింబాబ్వేను చిత్తుగా ఓడించి రన్ రేట్‌ను గణనీయంగా పెంచుకోవాల్సిన అవసరం ఉంది. అప్పుడే వెస్ట్ ఇండీస్‌తో జరిగే చివరి పోరులో కూడా భారత్‌కు అవకాశం ఉంటుంది.ఈ కీలకమైన డూ ఆర్ డై మ్యాచ్ గురువారం, 26వ తేదీన చెన్నైలోని వేదికగా జింబాబ్వేతో జరగనుంది. ఈ మ్యాచ్ కోసం టీం ఇండియా తుది జట్టులో మూడు కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ మార్పులు జట్టు బలాన్ని పెంచి, విజయావకాశాలను మెరుగుపరుస్తాయని భావిస్తున్నారు.

మొదటి మార్పుగా, ఫామ్ లేమితో గత కొంతకాలంగా సతమతమవుతున్న తిలక్ వర్మ స్థానంలో సంజు శాంసన్ జట్టులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. సంజు శాంసన్ బ్యాటింగ్‌లో స్థిరత్వాన్ని, దూకుడును తీసుకురాగలడని భావిస్తున్నారు. రెండవ మార్పుగా, వాషింగ్టన్ సుందర్ స్థానంలో ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ తుది జట్టులో చేరవచ్చు. అక్షర్ పటేల్ తన స్పిన్ బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ కీలక పరుగులు చేయగలడు.మూడవ, అత్యంత కీలకమైన మార్పు రింకు సింగ్‌కు సంబంధించింది. రింకు సింగ్ కుటుంబ అత్యవసర పరిస్థితుల కారణంగా హుటాహుటిన జట్టును వీడి ఇంటికి వెళ్ళిపోయినట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. తండ్రి అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, పరిస్థితులు విషమంగా ఉండటంతో అతడు వెంటనే వెళ్ళాల్సి వచ్చిందని సమాచారం. దీంతో గురువారం జింబాబ్వేతో జరిగే మ్యాచ్‌కు రింకు సింగ్ అందుబాటులో ఉంటాడా లేదా అనే సందిగ్ధత నెలకొంది. ఫినిషర్‌గా మెరుపులు మెరిపించాల్సిన రింకు ఈ ప్రపంచ కప్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. వ్యక్తిగత కారణాలు, ప్రస్తుత ఫామ్ దృష్ట్యా అతడిని జింబాబ్వేతో మ్యాచ్‌లో ఆడించే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు, మ్యాచ్ జరిగే చెన్నై పిచ్ స్పిన్‌కు అనుకూలించే అవకాశం ఉండటంతో రింకు స్థానంలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ తుది జట్టులోకి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.మొత్తంగా, తిలక్ వర్మ స్థానంలో సంజు శాంసన్, వాషింగ్టన్ సుందర్ స్థానంలో అక్షర్ పటేల్, రింకు సింగ్ స్థానంలో కుల్దీప్ యాదవులతో కూడిన ఈ మూడు మార్పులు జింబాబ్వేతో జరిగే ఈ డూ ఆర్ డై మ్యాచ్‌లో టీం ఇండియాకు కీలకం కానున్నాయి. ఈ మార్పులతో భారత జట్టు సెమీ ఫైనల్ రేసులో నిలబడటానికి పటిష్టంగా సిద్ధమవుతోంది.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com